సాక్షి
ఒడిశా



రోడ్డెక్కిన మహిళలు

జయపురం: తాగునీటి డిమాండ్‌తో కుంద్రా సమితి కలియకాద గ్రామానికి చెందిన మహిళలు శుక్రవారం ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పంచాయతీ విస్తరణాధికారి రవీంద్ర పుజారి చేరుకొని, సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు.



చకాచకా.. రథ చక్రాల్

● పర్లాకిమిడిలో చురుగ్గా సాగుతున్న రథయాత్ర పనులు

- 8లో



తాగిన మత్తులో తండ్రీ కొడుకులపై దాడి

- 8లో

శనివారం । 10 । జూన్ । 2023

న్యూస్‌రీల్

డీసీసీ అధ్యక్షుడిగా బిజయ్ గమాంగొ


బిజయ్‌కుమార్ గమాంగొ

రాయగడ: జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షుడిగా బిజయ్‌కుమార్ గమాంగొ నియమితులయ్యారు. ఆయన నియామకంపై ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణు గోపాల్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. డీసీసీ అధ్యక్షుడిగా ఇప్పటి వరకు సేవలందించిన దుర్గాప్రసాద్ పండా కొద్ది నెలల క్రితం పీసీసీ సాధారణ కార్యదర్శిగా నియమితులవ్వడంతో ఆ స్థానం ఖాళీగా ఉంది. గుణుపూర్‌కు చెందిన బిజయ్ గమాంగొ పార్టీలో సీనియర్ నాయకుడిగా సేవలందిస్తున్నారు. అలాగే రాయగడ జిల్లా ప్రప్రథమ జిల్లా పరిషత్ చైర్మన్‌గా వ్యవహరించారు. డీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన ఆయనకు పార్టీ కార్యకర్తలు, నాయకులు అభినందించారు.

గాలివాన బీభత్సం..


నారాయణపట్నలో ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

కొరాపుట్: జిల్లాలోని నారాయణపట్న సమితి కేంద్రంలో కాలవైశాఖి విజృంభించింది. శుక్రవారం ఉదయం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ గాలులు వీచాయి. దీంతో పాల కొండ వీధి, తెంపికోట వీధుల్లో 6ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయి, తీవ్రంగా ధ్వంసమయ్యాయి. దీంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బయటకు పరుగులు తీశారు. సాయంత్రం నారాయణపట్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని నష్ట పరిహారాన్ని అంచనా వేశారు. త్వరలో ప్రభుత్వ సాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఎండీఎం సహాయకుల వినతి..

జయపురం: తమకు కనీస వేతనంతో పాటు సామాజిక రక్షణ వ్యవస్థ కల్పించాలని అఖిల ఒడిశా మధ్యాహ్న భోజన పథకం(మిడ్ డే మీల్) వంట సహాయకులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. డిమాండ్ల సాధనకు ర్యాలీ చేపట్టి, విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట ఆందళన జరిపారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి తులసీ ప్రధాన్ తదితరులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పేరిట వినతిపత్రాన్ని బీఈఓకు అందజేశారు. ఇందులో వంట సహాయకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు రూ.27 వేలు వేతనంగా చెల్లించాలని, ఏడాదికి 10 నెలలకు బదులుగా 12 నెలలు జీతాలు చెల్లించాలని, 60 ఏళ్ల వయసు నిండిన వారికి పింఛన్ సౌకర్యం కల్పించాలని, విద్యార్థుల సంఖ్య ఆధారంగా సహాయకులను నియమించాలని, 15 సెలవు దినాలు మంజూరు చేయాలని విన్నవించారు. ఆందోళనలో సంఘం సలహాదారు ఉత్తమ మల్లిక్, యుధిష్టర్ రౌళొ, కార్యదర్శి తులసీ ప్రధాన్, మితిల శుక్రి, గురువారి కిర్సాని, సులోచన ప్రధాన్, లక్ష్మీ భరత్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ ముఠా అరెస్ట్

● చోరీ సొత్తు రికవరీ చేసిన పోలీసులు


నిందితుల నుంచి సీజ్ చేసిన చోరీ సొత్తు

బరంపురం: నగరంలోని గాయత్రీ విహార్ 7వ లైన్‌లో వారం క్రితం జరిగిన దోపిడీకి సంబంధించి పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వివరాలను ఐఐసీ అధికారి భూపతి మహంతి శుక్రవారం తెలిపారు. ఈనెల 1న అర్ధరాత్రి పెద్దబజార్ పోలీసు స్టేషన్ పరిధిలోని గాయత్రీ విహార్ 7వ లైన్‌లో నివాసం ఉంటున్న సుశాంత్ మిశ్రా ఇంట్లో దొంగతనం చోటు చేసుకుంది. దుండగులు చొరబడి నగదు, వెండి సామగ్రితో పరారయ్యారు. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.2వేల నగదు, 10తులాల వెండి సామగ్రి, 2 వాహనలు, బ్యాంక్ పాస్ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన శంకర్ పరిఢా(20), బాబు సాహు(25), రాజ పాత్రొ(23), ఆకాష్ పండా(22)గా గుర్తించారు.

వార్షికోత్సవాలకు హాజరైన తెలుగు భక్తులు





వైభవంగా ఆలయ వార్షికోత్సవం

● హాజరైన ఎంపీ రమేష్, కలెక్టర్ మిశ్రా, ప్రజాప్రతినిధులు

కొరాపుట్: నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో ఉన్న బాలాజీ మందిరంలో వార్షికోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రధాన రహదారిలో శ్రీవారి ఉత్సవ విగ్రహాలతో తిరువీధి నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణం ఘనంగా జరిపారు.

అనంతరం నవరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్‌చంద్ర మాఝి, కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతూ ఇటీవల 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్ పర్యటనలో మంజూరు చేసిన రూ.10 లక్షలతో కల్యాణ మండపం నిర్మాణం ప్రారంభించాలని సూచించారు. ఎంపీ మాట్లాడుతూ తన కోటా నిధులతో అదనపు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. నవరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్, సతీమణి కౌసల్య, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారీ, నవరంగ్‌పూర్ మున్సిపల్ చైర్మన్ కును నాయక్ స్వామివారిని దర్శించుకొని, అన్నప్రసాదం స్వీకరించారు. మధ్యాహ్నం సుమారు 5వేల మందికి అన్నదానం చేపట్టారు. సాయంత్రం కుంకుమార్చనలు నిర్వహించారు. జిల్లాలో ఏకైక బాలాజీ దేవాలయం కావడంతో తెలుగు ప్రజలు నలుమూలల నుంచి తరలివచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ కె.ధనంజయ పట్నాయక్, నందికేశ్వరరావు, సీహెచ్ బాబా యుగంధర్, రవిరెడ్డి, పొట్నూరు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.


ఆలయ కమిటీ సభ్యులతో ఎంపీ రమేష్‌చంద్ర మాఝి


కలెక్టర్ మిశ్రాను ఆశీర్వదిస్తున్న అర్చకులు


స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సదాశివ దంపతులు

పర్లాకిమిడి, కాశీనగర్

సుందరీకరణకు చర్యలు


మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ చంద్రశేఖర సాహు

● ఎంపీ చంద్రశేఖర సాహు

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్ నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్(ఎన్ఏసీ), పర్లాకిమిడి పురపాలక సంఘం పరిధిలో ముక్తా యోజనా పథకం కింద మౌలిక సదుపాయాలు, సోలార్ లైట్లు, డ్రైయిన్లు, రోడ్ల మరమ్మతుల చేపట్టేందుకు రూ.7 కోట్ల నిధులు అవసరమని గుర్తించామని ఎంపీ చంద్రశేఖర సాహు తెలిపారు. ఈ మేరకు అంచనాలను నివేదికను రాష్ట్ర 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్‌కు పంపామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఓస్వాన్ చాంబర్‌లో జిల్లా పాలనాధికారి, ఏడీఎం, మున్సిపల్, రోడ్లు–భవనాల శాఖ ఇంజినీర్లతో కలిసి శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని కాశీనగర్, గుమ్మా, గుసాని, రాయఘడ సమితి కేంద్రాల్లో వివిధ పథకాల అమలుకు సీఎం నవీన్ పట్నాయక్ ఇప్పటికే రూ.370.18 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఇదే తరహాలో పర్లాకిమిడి పురపాలక సంఘం, కాశీనగర్ ఎన్ఏసీకి కూడా ముక్తా పథకం ద్వారా నిధులు మంజూరు చేసి, పట్టణ సుందరీకరణకు చర్యలు చేపడతామన్నారు.

నిధుల మంజూరు హామీ ఇచ్చిన పాండ్యన్‌కు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో పర్లాకిమిడి మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలాశెఠి, బీజేడీ యువజన అధ్యక్షుడు శాసనం లింగరాజు, కౌన్సిలర్లు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయం


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

రాయగడ: బాల కార్మికుల నిర్మూలనే ధ్యేయంగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం జిల్లా శిశు సంరక్షణ కమిటీ, జిల్లా కార్మికశాఖ సంయుక్తంగా పాదయాత్ర నిర్వహించారు. స్థానిక కొరాపుట్ కూడలి నుంచి మెయిన్ రోడ్డు మీదుగా నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు.

జిల్లా శిశు సంరక్షణ కమిటీ అధికారి రమేష్‌చంద్ర నాయక్, యాక్షన్ ఎయిడ్ జిల్లా కన్వీనర్ రత్నేశ్వర్ సాహు, జిల్లా కార్మికశాఖ అధికారి జాస్మిన్ సాహు, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

మిరావళి విజేత.. కొనిసింగి


విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న ప్రతాప్ పువ్వల

రాయగడ: సదరు సమితిలో మే 23నుంచి జరుగుతున్న మిరావళి క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గుమ్మలక్ష్మీపురం మండలం కొనిసింగి జట్టు విజయం సాధించింది. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కొనిసింగి, సనొసందుబడి జట్లు తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ ప్రారంభించిన కొనింగి జట్టు నిర్ణీత 12 ఓవర్ల 124 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో సనొసందుబడి జట్టు 80 పరుగులు మాత్రమే చేయగలిగింది. రైతు ఐఖ్యత పరిషత్ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ పువ్వల ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు ట్రోఫీతో పాటు రూ.12 వేల నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులకు ఇటువంటి పోటీలు ఎంతో ఉత్సాహాన్ని స్తాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రితమ్‌కుమార్, సత్యబాన్ మండంగి తదితరులు పాల్గొన్నారు. టోర్నామెంట్‌లో మొత్తం 32 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు.

కాసీపూర్‌లో దారుణ హత్య


రాజేంద్ర నాయక్ (ఫైల్)

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాజేంద్ర నాయక్(54) శుక్రవారం దారుణ హత్యకు గురయ్యారు. అతనిపై ముగ్గురు వ్యక్తులు మరణాయుధాలతో దాడి చేయడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం తెలుసుకున్న కాసీపూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు పోస్టుమార్టం నిమిత్తం పీహెచ్‌సీకి తరలించారు. దీనిపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజేంద్ర నాయక్ కాసీపూర్‌కు సమీపంలోని సికరలోడ గ్రామంలో ఉన్న తన పొలానికి వ్యవసాయం పనులు చూసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో చంద్రగిరి పంచాయతీకి చెందిన భాగో గౌడొ, అతని ఇద్దరు కుమారులు అతనిపై మరణాయుధాలతో ఒక్కసారిగా దాడికి దిగారు. దీంతో తీవ్రగాయాల పాలైన నాయక్.. అక్కడిక్కడే కుప్పకూలిపోయారు. అనంతరం నిందితులు పరారయ్యారు. గత కొద్ది కాలంగా ఇరువర్గాల మధ్య తగాదాలు ఉన్నాయని సమాచారం. మృతుడు కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా యువజన కాంగ్రెస్ సమితి అధ్యక్షుడిగా ఉన్నారు. అతని మృతిపట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

నిందితుల అరెస్ట్‌కు డిమాండ్


రోడ్డుకు అడ్డంగా బండరాళ్లతో ఆందోళన నిర్వహిస్తున్న గ్రామస్తులు

బరంపురం: స్థానిక నగరానికి సమీపంలోని మౌడా గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్న నిందితులను పోలీసులు వెంటనే అరెస్ట్ చేయడంతో పాటు కఠినంగా శిక్షించాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలోని మెయిన్ రోడ్డుపై ఆందోళనకు దిగారు. దిగపండి పోలీసు స్టేషన్ పరిధిలోని తమ గ్రామంలో కొంత మంది వ్యక్తులు అక్రమంగా చొరబడి, అరాచకంగా సృష్టిస్తున్నారని తెలిపారు. దీనిపై పోలీసులు వెంటనే కలుగజేసుకోవాలని కోరారు. అయితే దీనిపై ఇదివరకే ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంతో నిరసనగా రోడ్డుకు అడ్డంగా బండరాళ్లు, చెట్లు దుంగలు వేసి, ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని, ఆందోళనకారులను శాంతింపజేశారు.


గ్రామస్తులతో చర్చిస్తున్న పోలీసులు

రెజ్లర్లకు న్యాయం చెయ్యండి


నిరసన ర్యాలీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

● జయపురంలో సీపీఎం నాయకుల నిరసన

జయపురం: ప్రపంచ క్రీడారంగంలో అనేక పతాకాలు సాధించి, దేశానికి గౌరవ మర్యాదలు తెచ్చిపెట్టిన రెజ్లర్లు.. గత నెల రోజులుగా దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన జరుపుతున్నా కేంద్రం ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని సీపీఐ కొరాపుట్ జిల్లా నాయకులు విమర్శించారు. మహిళా పహిల్వాన్లపై బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషన్ సింగ్ అమానుషంగా ప్రవర్తించారనే ఆరోపణపై దర్యాప్తు జరిపి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జయపురంలో శుక్రవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. జయపురం కార్మిక భవనం నుంచి వందలాది మంది కార్యకర్తలు ఎర్రజెండాలు పట్టుకొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రాష్ట్రపతిని ఉద్దేశించిన వినతిపత్రాన్ని జయపురం విద్యాశాఖాధికారికి సీపీఎం జిల్లా కార్యదర్శి జుధిష్టర్ రౌళొ అందజేశారు. ఇందులో రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరారు. ప్రధాని నరేంద్రమోదీ బేటీ బచావ్, బేటీ పడావో నినాదాలు ప్రకటనలకే పరిమితయ్యాయని ఆక్షేపించారు. రెజర్లకు జరుగుతున్న అన్యాయంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, న్యాయమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


విద్యాశాఖాధికారికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

సౌధామిని మృతిపై క్రైం శాఖతో దర్యాప్తు

● నవోదయ విద్యార్థిని కుటుంబానికి ఎస్పీ హామీ


నిరసనకారులతో మాట్లాడుతున్న ఎస్పీ స్వాతి ఎస్.కుమార్


విద్యార్థిని ఫొటోలతో కలెక్టరేట్‌కు వెళ్తున్న సీపీఎం నాయకులు, మద్దతుదారులు

పర్లాకిమిడి: జిల్లాలోని జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థిని సౌధామిని రైతో అనుమానాస్పద మృతిపై దర్యాప్తు చేపట్టాలని గత 46 రోజులుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేస్తున్న బాధిత కుటుంబానికి ఉపశమనం లభించింది. విద్యార్థిని తల్లి సుజ్ఞాణి చేపట్టిన నిరసనకు మద్దతు పలికిన సీపీఎం నాయకులు, కుటుంబ సభ్యులు శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఘటనపై జిల్లా యంత్రాంగం పోలీసులు స్పందించక పోవడంతో కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చారు. వందలాది ఆందోళనకారులు సౌధామిని ఫొటోలు, ఎర్ర జెండాలతో ర్యాలీ చేపట్టారు. సీపీఎం రాష్ట్ర నాయకులు జగన్నాథ మిశ్రా, మాజీ ఎంపీ ఓళికిశోర్ పట్నాయక్, జిల్లా కార్యదర్శి దండపాణి రైతో, సీపీఎం(ఎల్) శ్రీనివాస బెహరా తదితరులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. కొందరు ఆందోళనకారులు పెట్రోలు బాటిళ్లతో చేరుకొని, కలెక్టరేట్ లోపలికి చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ కలెక్టరేట్‌కు చురుకొని, ఓళికిశోర్‌తో మాట్లాడారు. విద్యార్థిని మృతి కేసు దర్యాప్తుకు రాష్ట్రప్రభుత్వం క్రైంశాఖ దర్యాప్తుకు అనుమతించిందని, దీనిపై సాయంత్రం లోగా స్పష్టత వస్తుందని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు శాంతించి, తిరుగు పయనమయ్యారు.

క్లుప్తంగా

కొట్లాటకు దారితీసిన కుటుంబ వివాదం


చికిత్స పొందుతున్న గంగరాజు

పార్వతీపురం: కుటుంబంలో ఏర్పడిన చిన్నపాటి వివాదం కొట్లాటకు దారితీసింది. దీనికి సంబంధించి అవుట్‌పోస్టు పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాలు... పార్వతీపురం మున్సిపాల్టీ జగన్నాధపురానికి చెందిన వి.గంగరాజు, తన వదిన కూతురు మహేశ్వరీకి సంబంధించిన కుటుంబ సమస్య పెద్ద మనుషుల మధ్య చర్చించుకుంటున్నారు. ఈ సమయంలో మహేశ్వరి భర్త సోమేశ్వరరావు తమ్ముడు ఎం.సతీష్ మధ్యలో వచ్చి దుర్భాషలాడి గంగరాజును పలుచోట్ల గాయపరిచాడు. ఈ ఘటనలో గంగరాజుకు ఎడమ కన్ను పైభాగంలో గాయమైంది. ఈ మేరకు చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వివాహిత ఆత్మహత్యా యత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగిణి

పార్వతీపురం: భార్యాభర్తల మధ్య చిన్న వివాదం భార్య ఆత్మహత్యా యత్నానికి దారితీసింది. అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు.. పార్వతీపురం మున్సిపాలిటీ తాళ్లబత్తుల వీధికి చెందిన ఎస్‌కే నాగిణి తన భర్త మహమ్మద్ లతీఫ్‌తో కుటుంబ సమస్యల విషయమై గొడవ పడింది. ఈ వివాదంలో నాగిణిపై భర్త లేనిపోని మాటలు అనడంతో మనస్తాపానికి గురైంది. దీంతో ఇంట్లో ఉన్న ఎలుకల మందును తాగి ఆత్మహత్యకు యతి్నంచింది. స్థానికులు గమనించి నాగిణిని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

యువకుడు ఆత్మహత్య


మోహనరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న హెచ్‌సీ కృష్ణమూర్తి

వీరఘట్టం: ఖాళీగా తిరిగే బదులు ఏదైనా పని చేసుకోవాలని కుటుంబ సభ్యులు చెప్పడంతో మనస్తాపానికి గురైన వీరఘట్టం గొల్లవీధికి చెందిన గార మోహనరావు(25) గడ్డి మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు. ఏడాది క్రితం దేవి అనే యువతిని వివాహం చేసుకున్న మోహనరావు ఖాళీగా ఏ పనీ లేకుండా ఉండడంతో కుటుంబ సభ్యులు ఈ నెల 6న మందలించారు. కుటుంబ సభ్యులు తనను నిలదీయడంతో మనస్తాపం చెందిన మోహనరావు ఈ నెల 6 సాయంత్రం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మోహనరావును పాలకొండ ఏరియా ఆస్పత్రికి అక్కడ నుండి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మూడు రోజులుగా మృత్యువుతో పోరాడుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచాడు. మృతుని భార్య దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ పి.కృష్ణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైకులు ఢీకొని నలుగురికి గాయాలు


బైక్‌లు ఢీకొన్న సంఘటనలో తలకు తీవ్ర గాయాలైన చింటు

కురుపాం: మండలంలోని గుజ్జుపాడు గ్రామ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో శుక్రవారం నలుగురురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. కెరడ గ్రామానికి చెందిన కె.చింటు, టి.కిరణ్, సాయి ఒకే ద్విచక్రవాహనంపై మొండెంఖల్ గ్రామం వైపు ఫొటో సూట్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. కొరిశీల గ్రామానికి చెందిన పి.వినోద్ కురుపాంలో పామాయిల్ కంపెనీలో విధులకు వెళ్లా మధ్యలో అటవీ శాఖ వాహన డ్రైవర్ బి.అప్పారావు లిఫ్ట్ అడుగ్గా ఎక్కించి వస్తున్నాడు. గుజ్జుపాడు గ్రామ సమీపంలో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో కె.చింటు తలకి తీవ్ర గాయాలు కాగా, టి.కిరణ్ కాలికి తీవ్ర గాయమైంది. పి.వినోద్‌చెయ్యి విరిగిపోగా, బి.అప్పారావు ముఖంపై గాయాలయ్యాయి. క్షతగాత్రులను కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి స్థానికుల వైద్యం కోసం తరలించగా మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కురుపాం ఎస్‌ఐ సి.హెచ్.ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేలో ఉద్యోగాల పేరిట డబ్బులు వసూలు

కొత్తవలస : రైల్వే శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసిన ముఠాపై కొత్తవలస గ్రామానికి చెందిన ఎస్.రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదుపై కొత్తవలస సీఐ ఎస్.బాలసూర్యారావు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

సీఐ అందించిన వివరాలు... రైల్వే శాఖలో ఉద్యోగాలు ఇపిస్తామని నమ్మించి డబ్బులు వసూలు చేసిన విశాఖపట్నానికి చెందిన ముఠా సభ్యులు కోటిపల్లి ప్రసాదరావు, సరళాదేవి, పద్మారావు, దేవిలపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ఈ ముఠా సభ్యులు రాజేశ్వరి తన బంధువులు ఎస్.చంద్రశేఖర్, డి.శివ వద్ద ఆరు లక్షల రూపాయలు వసూలు చేసినట్టు పేర్కొన్నారు.


పట చిత్రాల్లో భక్తులకు దర్శనమిస్తున్న చతుర్ధామూర్తులు


రాజవీధిలో చురుగ్గా సాగుతున్న రథాల పనులు


జగన్నాథ మందిర ప్రాంగణం టెంటులో పనులు చేస్తున్న వడ్రంగులు

చకచకా.. రథ చక్రాల్

- పర్లాకిమిడిలో చురుగ్గా సాగుతున్న రథయాత్ర పనులు

పర్లాకిమిడి: జగన్నాథ రథయాత్రకు పర్లాకిమిడిలో మూడు రథాల తయారీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రాష్ట్రంలో పూరీ తరువాత అత్యంత ఆడంబరంగా పర్లాకిమిడిలో రథయాత్ర నిర్వహించడం విశేషం. ఈ నేపథ్యంలో నందిఘోష్, తాళధ్వజ, దర్పదళన్ రథాల తయారీ పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. పనులు చేపడుతున్న రాజవీధి మీదుగా వాహనాల రాకపోకలు లేకుండా పోలీసులు నిలువరించి, పడాల వీధి వైపు ట్రాఫిక్‌ను మళ్లించారు. ఇప్పటి వరకు జగన్నాథ, బలభద్రుని రథాలు సగానికి పైగా పనులు పూర్తయినట్లు తయారీ ముఖ్య శిల్పకారులు అశోక్ మహారాణా తెలిపారు. రథ చక్రాలకు కొత్త కమ్మీలు, అవసరమైనచోట కొత్త కలపతో రథాన్ని నిర్మిస్తున్నామన్నారు. యాత్రకు 10 రోజులు మాత్రమే సమయం ఉన్నందున పనులు వేగవంతం చేసేందుకు రోజూ 20మంది వడ్రంగులు, పనివారిని నియమించారు. దీనికయ్యే ఖర్చులు, ఆదాయాలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం పర్యవేక్షిస్తోంది. మరోవైపు పర్లాకిమిడి జగన్నాథ మందిరంలో మూల విరాట్‌లు కనుమరుగై, పొట చిత్రాలతో భక్తులకు దర్శనమిస్తున్నారు. అనంత నారాయణుడు, అనంత వాసుదేవుడు, సుభద్ర భువనేశ్వరీ రూపంలో కొలువుదీరారు. మందిరంలో దైతాపతులు తెర మరుగున స్వామివారికి వివిధ సేవలు నిర్వహిస్తూ జ్వరం తగ్గడానికి మందులు అందిస్తున్నారు. చీకటి కొట్టులో ఉన్న జగన్నాథుడు, సుభద్ర, బలభద్రులకు ఒకవైపు సపర్యలు చేస్తూ మరోవైపు చిత్రకారులు కొత్త రంగులు అద్దుతున్నారు. జగన్నాథుని నేత్రోత్సవం ఈనెల 19న జరుగనుంది.

ఉప్పొంగిన అభిమానం

బలిజిపేట:

ఆ ప్రాంత వాసుల దశాబ్దాల కల నెరవేరింది. రాకపోకల కష్టాలు తొలగిపోయే రోడ్డు అక్కరకు రావడంతో అభిమానం ఉప్పొంగింది. ఎమ్మెల్యేకు పూలు, క్షీరాభిషేకాలతో పి.చాకరాపల్లి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని పి.చాకరాపల్లి- అజ్జాడ రోడ్డు నిర్మాణానికి పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషితో రూ.2.80 కోట్లు మంజూరైంది. రోడ్డు పనులు పూర్తికావడంతో శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళలు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, విద్యార్థులు, నిరుద్యోగులు ఇలా... అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషిచేస్తోందన్నారు. పేదల జీవన ఉన్నతికి పాటుపడుతోందని తెలిపారు. రూపాయి అవినీతిలేకుండా సంక్షేమ పథకాల నిధులన్నీ నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమ చేస్తున్నట్టు వెల్లడించారు. ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఇచ్చే మోసపూరిత హామీలను నమ్మొద్దన్నారు. ఒక గ్రామ సర్పంచ్ కార్యోన్ముఖుడయితే రోడ్డు నిర్మాణం వంటి అభివృద్ధి పనులు త్వరగా పూర్తవుతాయనేందుకు సర్పంచ్ మోహనరావు నిలువెత్తు నిదర్శనమన్నారు. 4.5 కిలోమీటర్ల పొడవున నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే జోగారావుకు సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు బాజాభజంత్రీలతో స్వాగతం పలికారు. రోడ్డు కష్టాలు తీర్చేనాయకుడు వచ్చాడంటూ అశ్వరథంపై ఊరేగింపుచేశారు. మహిళలు దాడిపొడవునా హారతులు పట్టారు. సర్పంచ్ ఇంటివద్ద ఎమ్మెల్యేకు పాలతో అభిషేకం జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు ఎంపీపీ నాగమణి, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీఓ విజయలక్ష్మి, పార్టీ మండలాధ్యక్షుడు మురళీకృష్ణ, సర్పంచ్‌లు సుందరరావు, విజయ, ఆర్.శ్రీనివాసరావు, ఎంపీటీసీలు రాజమోహన్, వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు దుర్గేశ్వరి, పలగర సహకార సంఘం అధ్యక్షుడు పకీరునాయుడు తదితరులు పాల్గొన్నారు.


రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే జోగారావు


ఎమ్మెల్యే జోగారావును క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

తాగిన మత్తులో తండ్రీ కొడుకులపై దాడి


తీవ్రంగా గాయపడిన శివ

జయపురం: తాగిన మత్తులో ఉన్న మిత్రుడిని బైక్ నడపవద్దు అన్నందుకు తండ్రి, కొడుకులను కత్తితో తీవ్రంగా గాయపరచిన ఘటన బొయిపరిగుడ సమితిలో చోటు చేసుకుంది. బాధితులు దశమంతపూర్ గ్రామానికి చెందిన త్రినాథ్ డాకువ, కుమారుడు శివ డాకువను బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్చారు. దీనిపై పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం దశమంతపూర్ గ్రామానికి చెందిన శివ డాకువ, మిత్రుడు రాజేష్ ఖీలో బైక్‌పై సొంత పనిపై శుక్రవారం జయపురం వెళ్లారు. పని ముగించుకొని తిరుగు ప్రయాణంలో రాజేష్ మద్యం సేవించాడు. దీంతో ముందు జాగ్రత్తగా తాను బైక్ నడుపుతానని శివ కోరాడు. దీనిపై ఇరువురి మధ్య వివాదం చోటు చేసుకుంది. దశమంతపూర్ చేరినా.. రాజేష్‌కు కోపం తగ్గక పోవడంతో స్నేహితుడిపై కత్తితో దాడి చేశాడు. వారిద్దరినీ విడిపించేందుకు వెళ్లిన త్రినాథ్‌పై కూడా కత్తితో దాడి చేశాడు. అంతటితో ఆయకుండా వారికి చెందిన మినీ వ్యాన్‌ను సైతం ధ్వంసం చేశాడు. గాయపడిన తండ్రీ, కొడుకులను బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్చారు. ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయితో ఇద్దరు యువకుల అరెస్ట్


గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకుల నుంచి అక్రమంగా తరలిస్తున్న 34కిలోల గంజాయిని అంబోదల పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఉత్తరప్రదేశ్ కు చెందిన దాశరథి వర్మ(21), ఆకాష్ సింగ్(23)ను అరెస్ట్ చేశారు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలోని గుణుపూర్ నుంచి గురువారం సాయంత్రం కారులో గంజాయిని ఉత్తరప్రదేశ్‌కు తరలించేందుకు యువకులు ప్రయత్నించారు. దీనిపై ముందస్తుగా అందిన సమాచారం మేరకు అంబోదల పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. దీంతో పట్టుబడిన గంజాయిని సీజ్ చేసి, నిందితులను శుక్రవారం ఉదయం కోర్టులో హాజరు పరిచారు. స్వాధీనం చేసుకున్న సరుకు విలువ సుమారు రూ.3.4 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

మరో 4 రోజులు భగభగలు



- విజయనగరం ఉమ్మడి జిల్లాలో ఉష్ణతాపం
- ఎండలో తిరగొద్దంటూ హెచ్చరికలు

విజయనగరం అర్బన్: వేసవి ఎండల తీవ్రత మరో నాలుగు రోజులపాటు ఉమ్మడి విజయనగరం జిల్లాలో కొనసాగనుందని రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. విజయనగరం జిల్లాలోని 27 మండలాల్లో వేపాడ, తెర్లాం, విజయనగరం మండలాలు మినహా మిగిలిన 24 మండలాల్లోను, పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో సాలూరు, సీతానగరం మండలాలు మినహా మిగిలిన 13 మండలాల్లో ఈ నెల 10, 11, 12, 13 తేదీల్లో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుందని ప్రమాదకర సూచిక జారీచేసింది. వీరఘట్టం మండలంలో 10వ తేదీన, జియమ్మవలస మండలంలో 13వ తేదీన 45 డిగ్రీల కు దాటి ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. జిల్లా వాసులను అప్రమత్తం చేయాలని జిల్లా యంత్రాంగానికి హెచ్చరికలు జారీ చేసింది.



ఏకలవ్య భవనాల పరిశీలన


ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణాలపై ఈఈకి సూచనలు ఇస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

భామిని: ఏకలవ్య మోడల్ స్కూల్ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ కె.నిషాంత్‌కుమార్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. భామిని మండల కేంద్రంలోని 12 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.12 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఏకలవ్య మోడల్ స్కూల్ భవనాల నిర్మాణాలను నిశితంగా పరిశీలించారు. నిర్మాణంలో నిలిచిన తరగతి గదులు, హాస్టల్, డార్మిటరీ భవనాలు సందర్శించారు. గుర్తింపు పొందిన కంపెనీల విద్యుత్ పరికరాలు, శానిటేషన్ పరికరాలు మాత్రమే ఉపయోగించాలని గిరిజన సంక్షేమ శాఖ ఈఈ సింహాచలంకు సూచించారు. జూలై నాటికి ఏకలవ్య పాఠశాల నూతన భవనాలు పూర్తిచేసి తరగతుల నిర్వహణకు అప్పగించాలని ఆదేశించారు. ఏకలవ్య పాఠశాల చుట్టు ప్రహరీ నిర్మాణానికి, అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు కేటాయించాలని ఈఈకు సూచించారు. దీనికి అనుగుణంగా ఆదేశాలిస్తామని చెప్పారు. కలెక్టర్ వెంట డీఈఈ కృష్ణకుమార్, తహసీల్దార్ నీలాపు అప్పారావు, ఏపీఓ ఇ.తులసీదాస్, ఎంపీడీఓ గుండేల చంద్రరావు, అధికారులు పాల్గొన్నారు.

నకిలీ డీఎస్పీపై కొనసాగుతున్న విచారణ

పార్వతీపురం: పోలీస్ శాఖలో ఉద్యోగాన్ని ఇప్పిస్తానని చెప్పి ఓ యువతి నుండి రూ. 2.70లక్షలు వసూలు చేసి ముఖం చాటేసిన నకిలీ డీఎస్పీ వ్యవహారంపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. యువత బలహీనతలను అడ్డం పెట్టుకొని ఇలాంటి మోసాలు నిత్యకృత్యమవుతున్నాయి. యువతి ఫిర్యాదు మేరకు ఫోన్ నంబర్ ఆధారంగా కొత్తవలసకు చెందిన వ్యక్తిని గుర్తించి పార్వతీపురం రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు నకిలీ డీఎస్పీని పోలీసులు విచారణ చేసి వాస్తవాలు బయటకు రప్పించే ప్రయత్నాలు ముమ్మరం చుస్తున్నారు. విచారణ అనంతరం విషయాలు బయటపడే అవకాశం వుందని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: కుటుంబ కలహాల నేపథ్యంలో బాత్రూమ్ క్లీనర్ తాగి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ స్థానిక గెంజిపేటకు చెందిన వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కంటోన్మెంట్ గెంజిపేటలో నివాసం ఉంటున్న సోము గోవింద్ (43) రైల్వే కాంట్రాక్ట్ కూలీగా పని చేస్తుండేవాడు. నిత్యం కుటుంబంలో మనస్పర్థలు తలెత్తడంతో ఈ నెల 7న ఇంట్లో ఉన్న బాత్రూమ్ క్లీనర్ తాగాడు. వెంటనే అతన్ని కేంద్రాస్పత్రికి, అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుని భార్య గౌరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ గోపాలరావు తెలిపారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు నలుగురి ఎంపిక


జాతీయ వాలీబాల్ పోటీలకు వెళ్లే జట్టులో జిల్లా క్రీడాకారులు, కోచ్‌లు

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న వాలీబాల్ పోటీలకు పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారుల ఎంపికయ్యారు. ఈ నెల 12వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరగనున్న ఆల్ ఇండియా ట్రైబల్ వాలీబాల్ పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టులోకి కురుపాం మండలం పాడిగూడ గ్రామానికి చెందిన పి.రాజశేఖర్, ఎ.మంగరాజులు, జీఎల్‌పురం మండలం మేదరగౌడ గ్రామానికి ఎ.దిలీప్, పి.మల్లేష్ అర్హత సాధించారు. జాతీయ పోటీలకు వెళ్లేరాష్ట్ర జట్టుకు కోచ్‌గా బి.వైకుంఠరావు నియామకమయ్యారు. జాతీయ స్థాయి పోటీలకు జిల్లా నుండి ఎంపికైన క్రీడాకారులకు జిల్లా వాలీబాల్ సంఘం అధ్యక్షుడు గవర సూరిబాబు, రాష్ట్ర కార్యదర్శి టీవీ భగవాన్ దాస్ ,జిల్లా కార్యదర్శి కేవీఏఎన్ రాజు అభినందించారు.

బంగారం చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్


చోరీ వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఉపేంద్ర

వంగర: మండల పరిధి పటువర్ధనంలో పట్టపగలు జరిగిన బంగారం చోరీ కేసును పోలీసులు చేధించారు. రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర చోరీకి పాల్పడిన ఇమంది లక్ష్మణరావు, చుక్కల శివరావులను శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. వీరిద్దరు ఈ నెల 6వ తేదీన గ్రామానికి చెందిన చుక్కల చిన్నప్పమ్మ ఇంట్లో చొరబడి ట్రంకు బాక్సు తాళాలు పగులగొట్టి రెండు తులాలు బంగారం పుస్తెలతాడు, అర తులం చెవి రింగులు దొంగలించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు క్లూస్ టీం సహాయంతో రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టి వారిని పట్టుకున్నారు. తామే దొంగిలించామని నిందితులు పోలీసులు ఎదుట ఒప్పుకున్నారు. వారి నుంచి దొంగిలించిన బంగారాన్ని రికవరీ చేశారు. దీంతో వారిద్దరినీ అరెస్ట్ చేసి పాలకొండ జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు సీఐ వెల్లడించారు. ఎస్‌ఐ ఆర్.జనార్ధనరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

హోరాహోరీగా ఉమెన్ టీ 20 క్రికెట్ లీగ్ పోటీలు

- బెజవాడ బ్లేజర్స్ జట్టుపై వైజాగ్ డాల్ఫిన్స్ విజయం
- రాయలసీమ క్వీన్స్‌పై విజయనగరం రోయల్స్ గెలుపు


బెజవాడ బ్లేజర్స్ జట్టుపై విజయం సాధించిన వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు


రాయలసీమ క్వీన్స్ జట్టుపై విజయం సాధించిన విజయనగరం రోయల్స్ జట్టు

విజయనగరం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ఉమెన్ టీ - 20 క్రికెట్ లీగ్ పోటీలు హోరా హోరీగా సాగుతున్నాయి. విజయనగరంలోని డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో జరుగుతున్న పోటీల్లో భాగంగా శుక్రవారం బెజవాడ బ్లేజర్స్ - వైజాగ్ డాల్ఫిన్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు 43 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించగా.. నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 177 పరుగులు చేసింది. బ్యాటింగ్‌లో రంగలక్ష్మి 65 బంతుల్లో 115 పరుగులు, ఎం.దుర్గ 55 బంతుల్లో 54 పరుగులతో రాణించారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన బెజవాడ బ్లేజర్స్ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 134 పరుగులు చేశారు. దీంతో వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు 43 పరుగుల తేడాతో విజయం సాధించింది. మధ్యాహ్నం జరిగిన మరో మ్యాచ్‌లో రాయలసీమ క్వీన్స్ జట్టుపై విజయనగరం రోయల్స్ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడిన విజయనగరం జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించగా... నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేయగా... అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన రాయలసీమ క్వీన్స్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి 160 పరుగులు మాత్రమే చేయగలిగింది. రెండు మ్యాచ్‌ల్లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు అతిథుల చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

క్లుప్తంగా

ఈసీసీఈలో 41 ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ ఎడ్యుకేషన్ కోర్సులో ప్రవేశాలకు గురు, శుక్రవారాలు కౌన్సెలింగ్ నిర్వహించారు. 50 సీట్లకు 41 మందికి ప్రవేశాలు జరిగాయి. ఆరు నెలల పాటు ఆన్‌లైన్‌లో క్లాస్‌వర్క్ నిర్వహించి, అనంతరం పరీక్షలు నిర్వహిస్తామని కోర్సు సమన్వయకర్త డాక్టర్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

వాక్ ఇన్ ఇంటర్వ్యూలు వాయిదా

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో ఈ నెల 11వ తేదీన జరగవల్సిన వాక్ ఇన్ ఇంటర్వ్యూలు 17వ తేదీకి వాయిదా వేసినట్లు రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్, బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ పోస్టులకు 17న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. నిబంధనలు మేరకు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంటుందని వివరించారు.

నౌపడలో గాలివాన బీభత్సం


గాలివానకు కూలిన షెడ్

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడలో శుక్రవారం మధ్యాహ్నం గాలివాన బీభత్సం సృష్టించింది. అకస్మాత్తుగా వచ్చిన గాలులకు పలు చోట్ల చెట్లు నేలకూలాయి. దాదాపు పావు గంట పాటు వడగళ్ల వాన కురిసింది. రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. గ్రామానికి చెందిన వృద్ధురాలు గుజ్జు బుల్లమ్మ రేకుల షెడ్డు కూలిపోయింది. అలాగే పలికిల రాజేశ్వరికి చెందిన వంటగదిపై భారీ తాటిచెట్టు పడి గది నేలమట్టమైంది. ఎల్లూరు సురేష్‌కు చెందిన రేకుల షెడ్డు గాలికి ఎగిరిపోయింది. సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

నేటితో ముగియనున్న ఏపీ పీజీ సెట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల ఐదు నుంచి జరుగుతున్న ఏపీ పీజీసెట్ -2023 పరీక్షలు శనివారంతో ముగియనున్నాయి. జిల్లాలో రెండు ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షలకు శుక్రవారం ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో మూడు షిఫ్టుల్లో జరగ్గా, మొదటి షిఫ్టులో 90కి 85, రెండో షిఫ్టులో 101 కి 86, మూడో షిఫ్టులో 8 మందికి ఏడుగురు హాజరయ్యారు. చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజీలో రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరగ్గా మొదటి షిఫ్టులో 66 కి 65 మంది, రెండో షిఫ్టులో 120కి 108 మంది హాజరయ్యారు.

న్యాయవాదులు ఐక్యంగా ఉండాలి


మాట్లాడుతున్న శాంతకుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవాదులు ఐకమత్యంతో మెలిగినప్పుడే దాడులను అరికట్టవచ్చునని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శాంతకుమార్ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న శ్రీకాంత్ చింతల రాజ్యాంగ నైతికత- పెను సవాళ్లు అనే అంశంపై మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అధ్యక్షుడు శాంతకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ న్యాయవాదులకు రూ.15వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే సెక్షన్ 41 (ఎ) సీఆర్ పీసీ రద్దు చేసేందుకు, న్యాయవాదుల హక్కుల కోసం ఐఎల్ఏ నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు. ఐఎల్ఏ ఉత్తర కోస్తా జిల్లాల కో-ఆర్డినేటర్ మంతిన అప్పారావు మాట్లాడుతూ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ కోసం ఐఎల్ఏ కలసి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జి.సురేష్‌బాబు, గోవిందరావు, వాన కృష్ణచంద్, అన్నెపు భువనేశ్వరరావు, అఫీసునాయుడు, ఎ.కృష్ణంరాజు, జిల్లా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి.చంద్రమౌళి, కార్యదర్శి చిన్నారావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

'వయోవృద్ధుల సంస్థలకు అనుమతి ఉండాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం, 2007 ప్రకారం వృద్ధాశ్రమాలు నిర్వహించడానికి అనుమతులు తప్పనిసరిగా ఉండాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకుడు కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకున్న వారికి నిబంధనల మేరకు అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. గుర్తింపు లేని వృద్ధాశ్రమాల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పూర్తి సమాచారం కోసం 08942- 240 519 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఎండ తీవ్రతకు 30 గొర్రె పిల్లలు మృతి


ఎండ తీవ్రతకు మరణించిన గొర్రె పిల్లలు

మందస: మండలంలోని మఖరజోల గ్రామం వద్ద ఎండ తీవ్రతకు 30 గొర్రెలు మృతి చెందాయి. నందిగాం మండలంలోని పాతులూరు, రథజన బొడ్డపాడు, మదనాపురం గ్రామాలకు చెందిన బుడ్డ రామయ్య, ఈది గవరయ్య, నమ్మి లచ్చయ్యలు గొర్రెలను ఈ ప్రాంతంలో మంద వేస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం మఖరజోల గ్రామం పొలాల్లో గొర్రెలను మేపుతూ పిల్లలను గూట్లో ఉంచారు. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రతకు 30 గొర్రె పిల్లలు మరణించాయి. గొర్రెలు తోలుకుని తిరిగి వచ్చి చూడగా మరణించిన గొర్రె పిల్లలు కనిపించడంతో వారంతా కన్నీరుమున్నీరయ్యాయి.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడాకారులు క్రీడలను సాదాసీదాగా కాకుండా, ఒక ప్యాషన్‌గా తీసుకుని ముందడుగు వేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పేర్కొన్నారు. రాష్ట్రం ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, స్పోర్ట్స్ కోటాతో క్రీడాకారులకు ఉజ్వలమైన భవిష్యత్ లభిస్తుందని ఆయన అన్నారు. 2023-24 ఏడాదికిగాను ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. శ్రీకాకుళం నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో జరిగిన ఈ ముగింపు కార్యక్రమానికి జేసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉన్నత చదువులు, ఉద్యోగాల సమయంలో స్పోర్ట్స్ కోటా పక్కాగా అమలవుతోందని అన్నారు. క్రీడాకారులకు లభించే గౌరవం, గుర్తింపు ఇంకెవరికీ ఉండవన్నారు. జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు జరిగిన తీరును డీఎస్ఏ సీఈఓ బీవీ ప్రసాదరావు వివరించారు. అనంతరం క్రీడాకారులకు, కోచ్‌లకు ప్రశంసా పత్రాలు, సమ్మర్ క్యాంప్‌ల పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఇటీవల జరిగిన ఏపీ సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా కబడ్డీ, హ్యాండ్‌బాల్ జట్ల క్రీడాకారులను అభినందించారు. ట్రోఫీలను బహూకరించారు. కార్యక్రమానికి జిల్లా డీఎస్ఏ చీఫ్ కోచ్ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, నెహ్రూ యువ కేంద్రం యూత్ ఆఫీసర్ కె.వెంకట్ ఉజ్వల్, పీఈటీ సంఘ ప్రతినిధులు వై.పోలినాయుడు, ఎమ్మెస్సీ శేఖర్, కె.మాధవరావు, సాదు శ్రీను, కోచ్‌లు, డీఎస్ఏ సిబ్బంది హాజరయ్యారు.


సీఎం కప్ ట్రోఫీలో విజేతగా నిలిచిన జిల్లా కబడ్డీ క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న జేసీ నవీన్

నైపుణ్యాభివృద్ధిరస్తు


డీఎల్‌టీసీ శ్రీకాకుళంలో కంప్యూటర్ శిక్షణలో నైపుణ్యాలు తెలుపుతున్న కోఆర్డినేటర్

- ఉద్యోగార్థులకు ఉపయోగపడుతున్న స్కిల్‌హబ్ సెంటర్లు
- రెండు విడతల్లో 346 మందికి శిక్షణ
- 219 మందికి ప్లేస్‌మెంట్లు
- 8 నియోజకవర్గ కేంద్రాల్లో స్కిల్ హబ్ సెంటర్లు

నరసన్నపేట: స్కిల్ హబ్ సెంటర్లు సామాన్యుల కలలు నెరవేరుస్తున్నాయి. శిక్షణ తీసుకోవడానికి ఆర్థిక స్తోమత లేక, కొత్త ఉద్యోగాల అన్వేషణకు దారి తెలియక ఇబ్బంది పడుతున్న దిగువ, మధ్య తరగతి యువతకు ఈ సెంటర్లు సాయం చేస్తున్నాయి. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గ కేంద్రాల్లో ప్రభుత్వం ఈ స్కిల్‌హబ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. గ్రామీణ యువతకు ఆసక్తి ఉన్న రంగంలో నైపుణ్యం కల్పించి వారికి తగిన విధంగా శిక్షణ ఇచ్చేందుకు ఇవి ఉపకరిస్తున్నాయి.


నరసన్నపేట స్కిల్ హబ్ కేంద్రంలో శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువతీ యువకులు

219 మందికి ప్లేస్‌మెంట్లు

జిల్లాలో ఫిబ్రవరి 16 నుంచి స్కిల్ హబ్ కేంద్రాలు నడుస్తున్నాయి. ఇప్పటి వరకూ రెండు విడతలుగా శిక్షణ పూర్తి చేశారు. వీటిల్లో 346 మంది శిక్షణ పొందగా 214 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. వీరు విశాఖపట్నంతో పాటు ఇతర పట్టణాల్లో పలు కంపెనీల్లో పనిచేస్తున్నారు. నెలకు రూ.12వేలకుపైబడి వేతనం అందుకుంటున్నారని నైపుణ్యాభివృద్ధి శాఖ జిల్లా అధికారులు అంటున్నారు. ప్రస్తుతం 8 కేంద్రాల్లో 241 మంది మూడో విడత శిక్షణ పొందుతున్నారు.

10 కేటగిరీల్లో శిక్షణ..

స్కిల్ హబ్ కేంద్రాల్లో ప్రస్తుతం 10 కేటగిరీల్లో యువతీ యువకులకు శిక్షణ ఇస్తున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్, ఫ్రెంట్ ఆఫీస్ అసిస్టెంట్స్, బీపీఓ, సేవింగ్ మిషన్ ఆపరేటర్, ఎక్కౌంట్స్ ఎగ్జిక్యూటివ్స్, ఫిట్టర్ ఫేబ్రికేషన్, ఫోర్ వీలర్స్ టెక్నిక్స్‌తో పాటు మరో మూడు కేటగిరీల్లో శిక్షణ అందిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



ముఖ్యమంత్రి ఆదేశాలతో జిల్లాలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో స్కిల్ హబ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. యువత సద్వినియోగం చేసుకోవాలి. వీటిల్లో శిక్షణ పొందిన వారికి వంద శాతం ప్లేస్‌మెంట్ సౌకర్యం కల్పిస్తాం. గతంలో ఇలాంటి శిక్షణ పొందాలంటే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు వారికి దగ్గరలోని కేంద్రాల్లోనే శిక్షణ లభిస్తోంది.
– సాయి శ్రీనివాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి

ప్లేస్‌మెంట్లు బాగున్నాయి..



నేను నరసన్నపేట స్కిల్ హబ్ సెంటర్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా శిక్షణ పొందాను. బాగా శిక్షణ ఇచ్చారు. ప్లేస్‌మెంట్ కూడా వచ్చింది. ప్రస్తుతం మీరాటెక్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. ఇలాంటి అవకాశాలు మాకు ఇవ్వడం సంతోషకరం. – చిలకలపల్లి సునీత, నరసన్నపేట

ఎస్‌ఈబీకి సొంతిళ్లు!


అద్దె భవనంలో సెబ్ జేడీ కార్యాలయం

- స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను బలపరిచేలా ప్రభుత్వ చర్యలు
- శ్రీకాకుళం జిల్లా సెబ్ కార్యాలయం సహా మూడు స్టేషన్లకు ప్రభుత్వ స్థలం గుర్తింపు
- మరో ఎనిమిది స్టేషన్లకు స్థలాలు గుర్తించడంలో నిమగ్నమైన అధికారులు


శ్రీకాకుళం సెబ్ ప్రధాన కార్యాలయానికి రూరల్ పరిధిలో స్థలం గుర్తించిన అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ)ని బలపరిచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఎస్‌ఈబీకి సొంత భవనాలు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటోంది. ఒకప్పటి ఎక్సైజ్ పోలీసు శాఖ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఎస్‌ఈబీగా రూపాంతరం చెందింది. జిల్లా సెబ్ ప్రధాన కార్యాలయం సహా 14 స్టేషన్లు అద్దె(పాత) భవనాల్లోనే సెబ్ పోలీసులు కష్టతరంగా విధులు నెట్టుకొచ్చారు. ఇప్పుడు 12 స్టేషన్లకు ప్రభుత్వ స్థలాలను సమకూర్చాలని కలెక్టర్‌కు, ప్రభుత్వానికి జిల్లా సెబ్ జాయింట్ డైరెక్టర్ (ఎస్పీ) విజయ నాగమణికంఠ ప్రతిపాదన పంపడంతో.. కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత తహసీల్దార్లు, మూడు రెవెన్యూ డివిజన్ల అధికారులు ప్రభుత్వ స్థలాలు గుర్తించి కేటాయించడంలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే శ్రీకాకుళంలో రెండు వేల గజాలకు గాను వెయ్యి గజాలు, నరసన్నపేట, ఇచ్ఛాపురం, పాతపట్నంలో చెరో వెయ్యి గజాలు గుర్తించారు. పాతపట్నంలో డాక్యుమెంట్ వెరిఫికేషన్ పూర్తిచేయాల్సి ఉంది. మరో వారం పదిరోజుల్లో స్థల కేటాయింపు జరుగుతుంది. మిగతా ఎనిమిదింటిలో పలాస సెబ్ స్టేషన్‌కు 1500, మిగతా వాటికి వేయి గజాలు చొప్పున ప్రభుత్వ స్థలం గుర్తించాల్సి ఉంది. కొత్తూరు లాఅండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ కొత్త భవంతిలోకి మారడంతో ఎస్పీ జీఆర్ రాధిక చొరవతో కొత్తూరు సెబ్ స్టేషన్, పీఎస్ పాత భవంతి (అద్దె కాదు)లోకి మారింది.

ప్రతిపాదనలు పంపించాం



ఎక్సైజ్ పోలీస్ శాఖగా ఉన్న నాటి నుంచి ఇప్పటివరకు పాత అద్దె భవనాల్లోనే విధులు నిర్వర్తిస్తున్నాం. ఇప్పుడు అన్ని సెబ్ స్టేషన్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సంబంధిత తహసీల్దార్లు, ఆర్డీవోలు వారి పరిధిలో ఇప్పటికే నాలుగు గుర్తించారు. వారం పది రోజుల్లో కేటాయింపు జరుగుతుంది. మరో ఎనిమిదింటికి ప్రభుత్వ స్థలం ఆరేడు సెంట్లు దొరుకుతుండటంతో స్థలాభావం ఏర్పడుతుందనే ఉద్దేశంతో వేచి చూస్తున్నాం. మరో నెలన్నర రోజుల్లో అన్నింటికి స్థల కేటాయింపు జరుగుతుందనే ఆశాభావంతో ఉన్నాం.
– విజయ నాగమణికంఠ, సెబ్ జాయింట్ డైరెక్టర్ (ఎస్పీ), శ్రీకాకుళం

డివిజన్ల వారీగా..

శ్రీకాకుళం జిల్లా ఎస్‌ఈబీ అధికారి కార్యాలయం ప్రస్తుతం ఫరీదు పేటలో ఉంది. దీంతో పాటు శ్రీకాకుళం సెబ్ స్టేషన్, శ్రీకాకుళం సెబ్ కార్యాలయాలు మూడింటికీ కలిపి రెండు వేల గజాలు కావాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం వెయ్యి గజాలు గుర్తించారు. కలెక్టర్‌కు నివేదిక పంపించారు. అలాగే నరసన్నపేట సెబ్ స్టేషన్‌కు వెయ్యి గజాలు ప్రతిపాదించగా.. వెయ్యి గజాలు గుర్తించారు. కలెక్టరేట్‌కు నివేదించారు. రణస్థలం సెబ్‌స్టేషన్‌కు వెయ్యి గజాలు ప్రతిపాదించగా.. స్థలాన్ని గుర్తించాల్సి ఉంది. అలాగే ఆమదాలవలస, పొందూరు సెబ్‌స్టేషన్లకు కూడా చెరో వెయ్యి గజాలు ప్రతిపాదించగా.. స్థలాలను గుర్తించాల్సి ఉంది. పలాస డివిజన్‌లోని ఇచ్ఛాపురం సెబ్ స్టేషన్‌కు వెయ్యి గజాలు ప్రతిపాదించారు. సంబంధిత స్థలాన్ని గుర్తించి కలెక్టరేట్‌కు నివేదించారు. సోంపేట, పలాస సెబ్‌స్టేషన్లకు స్థలం గుర్తించాల్సి ఉంది. టెక్కలి రెవెన్యూ డివిజన్‌లో కోటబొమ్మాళి, కొత్తూరు, టెక్కలి, పాతపట్నం సెబ్‌స్టేషన్లకు ఇంకా స్థలాలు గుర్తించాలి.

పక్కాగా జనన మరణాల నమోదు


రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న డీడీ సాయిశంకర్

గార: పక్కాగా జనన మరణాల నమోదు సచివాలయ స్థాయిలో జరగాలని, నమోదుపై అప్రమత్తంగా ఉండాలని డైరెక్టరేట్ సెన్సస్ ఆపరేషన్స్ (హైదరబాద్) డిప్యూటీ డైరెక్టర్ బీవీఎల్ సాయిశంకర్ అన్నారు. మండలంలోని మేజర్ పంచాయతీ శ్రీకూర్మం సచివాలయాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులతో కలసి సందర్శించారు. జనన, మరణాల నమోదు రిజిస్టర్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో ప్రసవాలు నమోదుకు ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా శిశు మరణాల సంఖ్య తగ్గుతుందన్నారు. ఆస్పత్రి ప్రసవాల ద్వారా జనన నమోదు కచ్చితత్వం ఉంటుందన్నారు. నమోదు ప్రక్రియలో నిబంధనలు తప్పకుండా పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ బి. శ్రీనివాసరావు, పంచాయతీ ఈఓ ఎ.కేశవరావు, చెట్టు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలకు అభినందనలు


అంబుగాంలో రక్తదాతలను అభినందిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస: సమాజ హిత కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం కావాలని రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని అంబుగాంలో శుక్రవారం జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ సమాజ చైతన్య కార్యక్రమాలను చేపట్టి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిక్కోలు ఉద్ధానం సేవాసమితి చేస్తున్న సమాజ సేవ అభినందనీయమన్నారు.

కిడ్నీవ్యాధి బాధితులకు అంబులెన్స్ ఏర్పాటు చేయడం ముదావహమని, ఈ సందర్భంగా అంబులెన్స్‌ను ప్రారంభించారు. రక్తదాన శిబిరాన్ని సందర్శించి, దాతలను అభినందించారు. అనంతరం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఛైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి ముఖ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని రాష్ట్ర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.విజయ్‌కుమార్ అన్నారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ ఎస్ఎం పురం క్యాంపస్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే ఇంటర్ క్యాంపస్ పురు షుల క్రీడల పోటీలు శుక్రవారం ప్రారంభించారు. ఈ క్రీడల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఒక్కో క్రీడలో శ్రీకాకుళం, ఇడుపులపాయ, నూజివీడు, ప్రకాశం నుంచి మొత్తం నాలు గు జట్లు పాల్గొంటాయి. ఉత్తమ క్రీడా ప్రదర్శన ఆధారంగా ఆర్జీయూకేటీ నుంచి జాతీయ స్థాయి, సౌత్ జోన్ విశ్వవిద్యాలయాల్లో ఆడే జట్లను ఎంపిక చేస్తారు. పోటీలను వీసీ ప్రారంభించి మాట్లాడారు. ట్రిపుల్ ఐటీలో చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు,డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ కొర్ల మోహన్ కృష్ణ చౌదరి, ఆర్జీయూకేటీ స్పోర్ట్స్ సెక్రటరీ షంషాద్ బేగం పాల్గొన్నారు.

బడుల ప్రారంభం రోజునే కానుకల పంపిణీ


ఎంఈఓకు సూచనలు చేస్తున్న డీఈఓ తిరుమల చైతన్య

నరసన్నపేట: విద్యార్థులకు పాఠశాలల ప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుక కిట్లు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈఓ తిరుమల చైతన్య తెలిపారు. స్థానిక బోర్డు స్కూల్లో విద్యా కానుక కిట్లు, పాఠ్యపుస్తకాల సరఫరాపై ఎంఈఓ శాంతారావుతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ స్కూల్స్‌లో జూన్ 12న జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే అన్ని పాఠశాలలకు కిట్లు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తామని తెలిపారు. నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 90 శాతం స్కూల్స్‌కు కిట్లు వెళ్లాయని మిగిలిన స్కూల్స్‌కు కూడా పంపించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

అన్నదాతకు మద్దతు


రైతులు మద్దతు ధరపై రైతులకు అవగాహన కలిగిస్తున్న అధికారులు (ఫైల్‌ఫోటో)

- ధాన్యం క్వింటాకు రూ. 143 పెంచిన కేంద్రం
- ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందుతున్న మద్దతు ధరలు
- పెంపుతో జిల్లాలో రైతులకు రూ.179 కోట్ల మేర ప్రయోజనం

నరసన్నపేట: కేంద్రం ఈ ఏడాదికి గాను పంటలకు మద్దతు ధరలను ప్రకటించింది. జిల్లా అధికంగా సాగవుతున్న ధాన్యంతో పాటు పలు పంటలకు మద్దతు ధరలను పెంచింది. అయితే ఇంకాస్త పెంచితే బాగుంటుందన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమైంది. గతంలో ఏడాదికి క్వింటాకు రూ. 50, రూ. 100ల పెంపుతో సరిపెట్టిన కేంద్రం ఈ సారి క్వింటాకు రూ. 143లు పెంచింది. తాజా పెంపుతో కామన్ ధాన్యం క్వింటా ధర రూ. 2183 కు చేరుకుంది. గత ఏడాది క్వింటాకు రూ. 2040 ధర ఉండేది. అలాగే గ్రేడ్ ఏ రకం ధాన్యం ధర క్వింటాకు రూ.2203 కు చేరింది. గత ఏడాదిలో గ్రేడ్ ఏ రకం ధాన్యం ధర క్వింటాల్‌కు రూ.2060 ఉండేది.

రైతులకు ప్రయోజనం

పెంచిన ధాన్యం మద్దతు ధరతో జిల్లాలో రైతులకు రూ. 179 కోట్ల మేరకు ప్రయోజనం కలగనుంది. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో సాధారణ వరి పంట విస్తీర్ణం 5 లక్షల ఎకరాలుగా వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. గడిచిన రెండు ఖరీఫ్ సీజన్‌లతో పోల్చితే సరాసరిన ఎకరాకు దిగుబడి 25 బస్తాల వరకూ ధాన్యం దిగిబడి వస్తుంది. ప్రతి బస్తాకు రూ. 143 మేరకు కేంద్రం మద్దతు ధర పెంచడంతో రూ.179 కోట్ల మేరకు రైతులకు ప్రయోజనం కలగనుంది.

మద్దతు ధరలు ఇలా..

కేంద్ర ప్రభుత్వం వరి ధాన్యంతో పాటు ఇతర పంటలకూ మద్దతు ధరలను ప్రకటించింది. పెసర రూ. 803, మినుము రూ. 350లు, మొక్కజొన్న రూ. 128లు, నువ్వులు రూ.805ల మేరకు పెంచింది. దీంతో మొక్కజొన్న రూ. 2090, పెసర రూ.8558, మినుములు రూ.6950, నువ్వులు 8635లకు క్వింటా ధర చేరింది. అలాగే రాగులు రూ. 268 లు, వేరుశనగ రూ. 527ల మేరకు పెంచింది.

వైభవంగా విజయదుర్గ ఆలయ వార్షికోత్సవం




శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని నానుబాలవీధిలో వేంచేసిన విజయదుర్గ అమ్మవారి ఆలయ 17వ వార్షికోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం సహస్ర పుష్పార్చన, కుంకుమార్చనలు నిర్వహించారు. 12 నుంచి రాజశ్యామల యాగ మహోత్సవం ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్పయాగ మహోత్సవం



శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని డీసీసీబీ కాలనీలో కొలువై ఉన్న భూసమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుష్పయాగ మహోత్సవం జరిగింది. ఆలయ అర్చకులు చామర్తి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో ముందుగా చూర్ణోత్సవం, మహాపూర్ణాహుతి, అవబృధ స్నానం నిర్వహించారు. అనంతరం స్వామికి అన్ని రకాల పుష్పాలతో నివేదన చేశారు. సాంస్కృతిక ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుంపల సన్యాసిరావు, భక్తులు పాల్గొన్నారు.

ఏపీఆర్‌డీసీ సెట్‌లో అచ్యుతరావుకు ఫస్ట్ ర్యాంకు


అచ్యుతరావు

నరసన్నపేట: ఏపీఆర్‌డీసీ ప్రవేశ పరీక్షలో కింజరాపు అచ్యుతరావు రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారని స్థానిక సంపత్ సాయి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గణపతిరావు తెలిపారు. పోలాకి మండలం కింజరావు వానిపేటకు చెందిన అచ్యుతరావు తల్లిదండ్రులు వ్యవసాయకూలీలు. ఏపీఆర్‌డీసీలో 119 మార్కులతో తనకు మొదటి ర్యాంకు రావడం ఆనందంగా ఉందని అచ్యుతరావు అన్నారు.